క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం



శ్రీధర్‌కు సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లికి చెందిన ఆటోడ్రైవర్ గాలి శ్రీధర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఉప్పలగుప్తం ఆటో యూనియన్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం ఆయనకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కట్టా దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కుంచే రవి, గోడి నాని, గెద్దాడ శివశంకర్, పోతుమూడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా మోహన్



పాలమూరి మోహన్

ఉప్పలగుప్తం: బహుజన సమాజ్ పార్టీ తరపున అమలాపురం నియోజకవర్గం అభ్యర్థిగా మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన పాలమూరి మోహన్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి నుంచి ఉత్తర్వులు అందినట్టు బుధవారం మోహన్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు, కోలా త్రిమూర్తులు, యాళ్ల దొరబాబులకు మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తాలూకా ఎస్ఐ శేఖర్ బాబు

అమలాపురం రూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రజలు సహకరించాలని అమలాపురం తాలూకా ఎస్ఐ శేఖర్ బాబు కోరారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువులో సర్పంచ్ నక్కా అరుణ కుమారి అధ్యక్షతన ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎన్నికల నియమావళిని వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, పమ్మి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కామనగరువులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీలో రూ.60 లక్షల పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సర్పంచ్ నక్కా అరుణకుమారి బుధవారం శంకుస్థాపనలు చేశారు. అబ్బిరెడ్డి కాలనీలో రెండు రోడ్లు, కరక్కాయ పేటలో రెండు రోడ్లు, బాలయోగి కాలనీలో మూడు రోడ్లు, డ్రైన్ల పనులకు సర్పంచ్ భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, వార్డు సభ్యులు నక్కా చంద్రశేఖర్, ఎంపీటీసీలు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

అమలాపురం టౌన్: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గొర్తి గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని అమలాపురానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జగనన్న అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై ఓ యూట్యూబ్ చానల్ ముందు ఆనందం వ్యక్తం చేస్తే టీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా ద్వారా మానసికంగా వేధించి చంపేశారన్నారు. దిశ చట్టం ద్వారా దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

నేడు తిరుమురుగన్ ప్రమాణ స్వీకారం

యానాం: పుదుచ్చేరి మంత్రి వర్గంలో స్థానం సంపాదించుకున్న కారైకల్ నార్త్ నియోజకవర్గ శాసన సభ్యుడు పీఆర్ఎన్ తిరుమురుగన్ గురువారం రాజ్‌నివాస్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటన విడుదల చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతో ప్రమాణం స్వీకారం చేయించనున్నారు. చంద్రప్రియాంక రాజీనామాతో తిరుమురుగన్‌కు మంత్రిగా అవకాశం లభించింది.

తల్లులకు ఆర్థిక భరోసా

- లింగవివక్షను రూపుమాపేందుకు పీఎంఎంవీవై
- తొలి కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో రూ.6 వేలు



గర్భిణికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుమ

అల్లవరం: దిగువ, మధ్య తరగతి కుటుంబాల్లో జీవన ప్రమాణాలను పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి ఆధారంగా ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని అమలుచేస్తున్నాయి. ఈ పథకం ద్వారా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సమస్యను నివారించడానికి, గర్భం ధరించిన స్త్రీకి పోషకాహార లోపం నివారించడానికి, అలాగే వారికి ఆర్థిక భరోసా కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా ఆడ, మగ తేడా లేకుండా లింగ వివక్షను దూరం చేయడానికి, ఆడపిల్లల సంఖ్యను గణనీయంగా పెంచే లక్ష్యంతో పథకాన్ని పక్కాగా అమలుచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు గర్భిణులను గుర్తించి, వారి వివరాలను మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్న గర్భిణులకు తొలి కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో రూ.6 వేలు ఇస్తున్నారు. తొలి కాన్పుకు ముందు మొదటి విడతగా రూ.వెయ్యి, రెండో విడతగా రూ.2 వేలు, కాన్పు అనంతరం మూడో విడతగా రూ.2 వేలు జమ చేస్తారు. తొలి కాన్పులో ఆడ లేదా మగ బిడ్డ ఎవరూ పుట్టినా ఈ పథకం వర్తిస్తుంది. రెండో కాన్పులో కేవలం ఆడ బిడ్డకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే రూ.6 వేలు తల్లి బ్యాంక్ ఖాతాలోకి నేరుగా జమ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు సంయుక్తంగా గర్భిణులను గుర్తించి వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

మండలంలోని గోడిలంక పీహెచ్‌సీ పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 591 మంది గర్భిణులను గుర్తించగా తొలి కాన్పులో 266 మంది, రెండో కాన్పులో 116 మంది గర్భిణులు అర్హత సాధించారు. బెండమూర్లంక పీహెచ్‌సీ పరిధిలో 8 సచివాలయాల పరిధిలో తొలి కాన్పులో 90 మంది, రెండో కాన్పులో 70 మంది గర్భిణులను పథకానికి అర్హులుగా గుర్తించారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తొలి కాన్పుకి రూ.5 వేలు, రెండో కాన్పుకి రూ.6 వేలు చొప్పున ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.

రూ.5 వేలు అందుకున్నాను



ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా తొలి కాన్పులో మూడు విడతలుగా రూ.5 వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– వి.సంధ్య, ఎంట్రుకోన గ్రామం, అల్లవరం మండలం

ఆడపిల్లల సంఖ్య పెంచేందుకు



లింగ వివక్ష నిర్మూలన, ఆడపిల్లల సంఖ్యను పెంచడం, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పీఎంఎంవీవై పథకం ద్వారా గర్భిణులకు తొలి కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే మరో రూ.6 వేలు అందిస్తున్నారు.

– డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, బెండమూర్లంక పీహెచ్‌సీ, అల్లవరం మండలం

అంబేడ్కర్ ఆశయాలు ఆచరణీయం



అమలాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు అందరికీ ఆచరణీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణం 28వ వార్డు పరిధిలోని దిగువ సావరంలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని మంత్రి విశ్వరూప్ బుధవారం ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ రాజీ గోపి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, దొమ్మేటి రాము, బండారు గోవిందు, పార్టీ ఎస్సీ విభాగం నాయకులు సరెళ్ల రామకృష్ణ, ఉండ్రు వెంకటేష్, మెండు రమేష్‌బాబు, నక్కా సంపత్‌కుమార్, కాశి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా సీఎం జగన్ పాలన



బండారులంకలో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- బండారులంకలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం రాత్రి బండారులంకలో దంగేటివారి పాలెం– మురుగులమ్మగుడి వరకూ రూ.1.72 కోట్లతో ఆర్అండ్‌బీ లింక్ రోడ్డు, రూ.38 లక్షల నరేగా నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీరామ్‌నగర్‌లో రోడ్లు, డ్రైన్‌కు భూమి పూజ చేశారు. దంగేటివారిపాలెంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి ఇంటి ముంగిటకే ప్రభుత్వం పథకాలను చేరవేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి, సర్పంచ్ పెనుమాల సునీత, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకిలక్ష్మి, పేదపూడి బాబూరావు, కుడుపూడి భరత్, కండిబోయిన భారతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



సీతారామపురంలో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన జరుగుతుందని టీటీడీ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లరేవు, కోరంగి, పటవల, జి.వేమవరం, చొల్లంగి, పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, లచ్చిపాలెం, సుంకరపాలెం, ఇంజరం, గోవలంక, పిల్లంక, ఉప్పంగల పంచాయతీల పరిధిలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. జల జీవన్ మిషన్ రూ.15 కోట్లు, ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ రూ.3.19 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంకులు, పైపులైన్‌లకు శంకుస్థాపనలు చేశారు. తాళ్లరేవు, పటవల, ఇంజరం–2, జార్జిపేట, గ్రామ సచివాలయాలు, తాళ్లరేవు, పిల్లంకలో రైతు భరోసా కేంద్రాలతో పాటు నీలపల్లిలో రెడ్డి మురళీమోహన్ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ తాళ్లరేవులో రూ.2.60 కోట్లతో నిర్మించిన రాపిడ్ శాండ్ ఫిల్టర్ గంటకు 4 లక్షల లీటర్ల తాగునీరు ఫిల్టర్ చేస్తుందన్నారు. దీంతో వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చేయగలిగామన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, చింతలపాటి శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, రేవు మల్లీశ్వరి, కాపవరపు శ్రీదేవి, పెంకే అర్జున్, దవులూరి శ్రీరామ్మూర్తి, అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, రెడ్డి సతీష్, అంకాడి అంజిబాబు, దున్నా శ్రీకాంత్, మట్టపర్తి లోవరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ ఇళ్ల పట్టాలను అందించి పేదలను ఆదుకుంటున్నారని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తంలో బుధవారం ఆయన అధ్యక్షతన 105 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా చిన్నవరాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇళ్ల స్థలాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోకా శ్రీను, రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాల సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, మోటూరి సత్యంకాపు, చేట్ల విద్యాసాగర్, దోనిపాటి వెంకట రామకృష్ణ, గోడి దుర్గారావు, తోలేటి రామ్‌కుమార్, తొత్తరమూడి వీరదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ మొక్కుకున్న అభిమాని



వెంకటేశ్వరరావును అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ తదితరులు

అల్లవరం: ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి దేవగుప్తం గ్రామానికి చెందిన పెచ్చెట్టి వెంకటేశ్వరరావు. వైఎస్సార్ సీపీ వీరాభిమాని. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారాయన. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని విజయవాడ కనకదుర్గమ్మకు తలనీలాలు మొక్కుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇలాగే మొక్కుకుని కనకదుర్గమ్మకు తలనీలాలు సమర్పించిన ఆయన మళ్లీ అదే పంథా అనుసరిస్తున్నారు. పార్టీ విజయం కోసం, సీఎం జగన్ ముఖ్యమంత్రి కావాలంటూ మొక్కుకున్న వెంకటేశ్వరరావుని మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ సాధనాల వెంకటరావు తదితరులు అభినందించారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ఇంటింటికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ 4, 5, 6 వార్డుల ప్రజల కోసం నగర పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం శిబిరంలో సుమారు 150 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ నూకరాజు, డా.యోగితా లక్ష్మి, డా.కెజియా, డా.పీవీబీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కులో స్వచ్ఛ భారత్



అంబేడ్కర్ మున్సిపల్ పార్కులో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా చిట్టడవిని తలపిస్తున్న స్థానిక అంబేడ్కర్ నగర్ మున్సిపల్ పార్కులో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం వచ్చే సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక ఆర్ఏఓ ఆఫీసు నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వేలాయుధం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యు.అనిల్‌కుమార్, అధ్యాపకుడు జయవీరన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సూర్యనగర్‌లోని వార్డు సచివాలయంలో 15, 16 వార్డులకు సంబంధించిన 18 మంది వలంటీర్లకు బుధవారం జరిగిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలకు మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం వారిని పలు నగదు పురస్కారాలతో సత్కరిస్తుందన్నారు. ఇదే కార్యక్రమంలో జగనన్న ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రత్రాలను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, పార్టీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి

అల్లవరం: క్షేత్రస్థాయిలో 50 కుటుంబాల్లోని సభ్యులకు పౌర సేవలు అందించడమే కాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లో వలంటీర్లు ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా సేవలు అందించారని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. బోడసకుర్రు సచివాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందించారు. కార్యక్రమంలో చెల్లుబోయిన రమేష్, అడపా శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, కారాడి సుబ్రహ్మణ్యం, దొమ్మేటి రాధాకృష్ణ, దొమ్మేటి శివస్వామి, డి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్వర్ణకార, విశ్వ బ్రాహ్మణ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: తెనాలిలో ఆత్మహత్య చేసుకున్న గొర్తి గీతాంజలి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ అమలాపురం పట్టణ స్వర్ణకార, విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పురవీధుల్లో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక గోల్డ్ మార్కెట్‌లోని కామాక్షీ ఆలయం నుంచి మొదలైన కొవ్వొత్తుల ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా గడియారం స్తంభం సెంటరు వరకూ సాగింది. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ క్రిస్టోఫర్‌కు స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. ర్యాలీలో రాష్ట్ర స్వర్ణకార సంఘం సహాయ కార్యదర్శి చేబోలు చంద్రశేఖర్, పట్టణ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, కార్యదర్శి ఓడూరి ఫణీంద్రకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, తాళాబత్తుల చినబాబు, చింతా నాని, పుల్లేటికుర్తి భాస్కరరావు, కట్టోజు రాము, తాళాబత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: గీతాంజలి మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కామనగరువు పంచాయతీ బడుగువారిపేటలో కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం సెక్రటరీ గొల్లపల్లి బాబి ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలియజేశారు. గీతాంజలిని వేధింపులకు గురి చేసిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో గంటి వెంకటలక్ష్మి, గంటి ఆదిలక్ష్మి, మంగం నాగలక్ష్మి, కుమారి, గొల్లపల్లి ఆదిలక్ష్మి, బడుగు సత్యవతి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



సాకుర్రులో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దళిత చైతన్య వేదిక నాయకులు

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు రాజోలు దళిత చైతన్య వేదిక నాయకులు బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.బాబూరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ పే బ్యాక్ టు ద సొసైటీ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు వంటి పరీక్ష సామగ్రి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక సమన్వయకర్త బత్తుల జనార్ధనరావు, ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, జె.భాస్కరరావు, వి.సూర్యనారాయణ, ఉప్పే సత్యనారాయణ, టి.వెంకటేశ్వరరావు, పీవీవీఎస్ రామారావు, ఎస్ఎస్ పట్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



ఆదర్శ మహిళల వేషధారణల్లో చిన్నారులు

యానాం: బాలికల సంరక్షణకు, హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సమగ్రా శిక్షా అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పేర్కొన్నారు. బుధవారం అయ్యన్ననగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో హెచ్ఎం దొమ్మేటి కృష్ణార్జునులు, ఎస్ఎంసీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం




తాళ్లరేవులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు సంతపేట సెంటర్‌లో నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, కాటంశెట్టి రామ్మూర్తి, సామా ప్రకాష్, రేవు మల్లీశ్వరి, బొంతు మోహన్, పెయ్యల మంగేష్, పోతుల రత్నకుమారి, కాశి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ-పుదుచ్చేరి సర్కార్ ప్రారంభం

యానాం: నూతనంగా పొడిగించిన కాకినాడ-పుదుచ్చేరి సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలును కాకినాడ పోర్టు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లాడి సత్తిబాబు మాట్లాడుతూ యానాం ప్రజల దశాబ్దాల కలైన సర్కార్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపునకు కృషి చేసిన పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వైథిలింగంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లంక బంగారం, చక్రవర్తి, యాదవ్, పోలిశెట్టి శ్రీనివాస్, చిన్న, రవికుమార్, స్టేషన్ ఇన్‌చార్జి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం



ఈవీఎంలపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్–1, 2 యూనిట్ల వలంటీర్ల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల వినియోగంపై అవగాహన కల్పించారు. స్థానిక మినీ సివిల్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎంలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నరేష్, ఎస్.శ్రీనివాస్, ఎన్నికల శాఖ అధికారి టి.అర్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పానీపూరి బండిని ఢీకొన్న ట్రాక్టర్

అయినవిల్లి: స్థానిక రావులమ్మ ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన ఉన్న పానీపూరి బండిని ఓ ట్రాక్టర్ ఢీకొన్న ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, అయినవిల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి చినపేట నుంచి ముక్తేశ్వరం వైపు అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదే గ్రామంలోని రావులమ్మ ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన రోడ్డు పక్కన ఉన్న పానీపూరి బండి, ఆటో, ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌ను ఢీకొంది. పానీపూరి బండి పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. దీనిపై పానీపూరి బండి యజమాని ఫిర్యాదు చేశారు.